రొయ్యూరులో కరకట్టపై గింజలను ఆరబెడుతున్న రైతులు



అయ్యో.. మొక్కజొన్న

అకాల వర్షాలకు తడిసిన పంట

- క్వింటాకు రూ.300 తగ్గించిన వ్యాపారులు
- కష్టాల్లో కూరుకుపోయిన రైతన్న

తోట్లవల్లూరు, మే 18 : నాలుగు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు వల్లూరుపాలెం, రొయ్యూరు, తోట్లవల్లూరు గ్రామాల్లో మొక్కజొన్న పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఇదే అదునుగా ప్రైవేట్ వ్యాపారులు ధరను భారీగా తగ్గించే యడంతో రైతులు కష్టాల్లో కూరుకుపోయారు. క్వింటా మొక్క జొన్న రూ.2,100 నుంచి రూ.2,200కు కొంటున్న వ్యాపారులు వర్షాన్ని కారణంగా చూపి ధరను తగ్గించేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శనివారం ఉదయం కుండపోత వాన కురవటంతో ఆరబెట్టిన మొక్కజొన్న పంట మళ్లీ తడిసిందని రైతులు కన్నీటిపర్యంతమయ్యారు. ఎకరంలో పంటను ఆరబెట్టి, పైన కప్పేందుకు పరదాలకు రోజుకు రూ.300 అద్దె ఖర్చవుతుందని, కూలీలకు రూ.1,500 ఖర్చవుతుందని, ఈ నేపథ్యంలో ధరలో కోత పెట్టడం తీవ్ర నష్టాలను కలిగి స్తుందని రొయ్యూరు రైతు వెంకటేశ్వరరావు తెలిపారు. 3,230 ఎకరాల్లోని మొక్కజొన్న సాగును ఈ-క్రాప్ చేసిన ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవటం వల్ల నష్టం కలుగుతోందని రైతు బి.కోటేశ్వరరావు తెలిపారు. ఇప్పటివరకు ఒక్క అధికారి కూడా తమ వద్దకు రాలేదన్నారు.



రొయ్యూరు కరకట్ట దిగువన పరదాలు కప్పి..



వల్లూరుపాలెంలో తడిసి మట్టికొట్టుకున్న మొక్కజొన్న కండెలు



గుడివాడలోని బంటుమిల్లి వెళ్లే రోడ్డులో నిలిచిపోయిన వర్షపు నీరు

తడిపేసిన వాన

జిల్లా వ్యాప్తంగా మోస్తరు వర్షాలు

- 5.2 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదు
- 22వ తేదీ వరకూ వానలే : వాతావరణ శాఖ

మచిలీపట్నం, మే 18 (ఆంధ్రజ్యోతి) : వాతావరణ మార్పులతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో శనివారం మోస్తరు వర్షం కురిసింది. ఈ నేపథ్యంలో ఈనెల 22 వరకు కోస్తాతీరం వెంబడి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందని, గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. కాగా, శనివారం మోపిదేవిలో అత్యధికంగా 19.6 మిల్లీమీటర్లు, అత్యల్పంగా పెదపారుపూడిలో 1.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లా సగటు వర్షపాతం 5.2 మిల్లీమీటర్లుగా నమోదైంది. ఇక అవనిగడ్డలో 13.4, మొవ్వలో 8.6, చల్లపల్లిలో 8.4, కంకిపాడు, కృత్తివెన్ను, పెనమలూరులో 8.2, నాగాయలంకలో 8.0, ఘంటసాలలో 7.8, పెడనలో 6.8, బంటుమిల్లిలో 6.2, మచిలీపట్నంలో 6.2, కోడూరులో 5.2, గూడూరులో 3.6, ఉయ్యూరులో 2.8, బాపులపాడులో 2.4, గన్నవరంలో 1.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

కాల్వలు సరిచేయండి

సాగునీటి కాల్వలు.. డ్రెయిన్లలో నిర్వహణ పనులే ప్రధాన అంశంగా శనివారం మచిలీపట్నంలోని జెడ్పీ హాల్లో జెడ్పీ సర్వసభ్య సమావేశం జరిగింది. జూన్ మొదట్లోనే ఖరీఫ్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో కాల్వలు, డ్రెయిన్లలో తూడు తొలగించేందుకు, ఇతర పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని జెడ్పీ సభ్యులు ప్రధాన సమస్యగా లేవనెత్తగా, కాల్వల నిర్వహణ పనులు చేపట్టేందుకు ఉన్నతాధికారుల అనుమతి కోరతానని చైర్‌పర్సన్ ఉప్పాల హారిక హామీ ఇచ్చారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో ప్రజాప్రతినిధులెవరూ హాజరుకాలేదు.

జెడ్పీ సమావేశంలో ప్రధాన అంశంగా చర్చ

- సాగునీటి కాల్వలు, డ్రెయిన్ల పనులు చేపట్టాలని సభ్యుల విజ్ఞప్తి
- రోగులను పట్టించుకోని వైద్యులను మార్చాలని వేడుకోలు
- తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోండని విన్నపం
- ఎన్నికల కోడ్ కారణంగా హాజరుకాని ప్రజాప్రతినిధులు



సమావేశానికి హాజరైన సభ్యులు, అధికారులనుద్దేశించి మాట్లాడుతున్న చైర్‌పర్సన్ ఉప్పాల హారిక

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక అధ్యక్షతన శనివారం జెడ్పీ సమావేశ హాల్లో జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి శాసనసభ్యులు, ఎంపీలు హాజరుకాలేదు. జెడ్పీటీసీ సభ్యులు కూడా పూర్తిస్థాయిలో రాలేదు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో అజెండా అంశాలు లేకుండానే సమావేశం నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ప్రస్తుత సమావేశం శాఖలవారీగా సమీక్షించడం లేదని, మరో నెలరోజుల్లో మళ్లీ నిర్వహిస్తామని చైర్‌పర్సన్ తెలిపారు. ఖరీఫ్ సీజన్ జూన్ నుంచి ప్రారంభమవుతున్న నేపథ్యంలో కాల్వల నిర్వహణ పనులకు అనుమతులు ఇవ్వాలని తాను కూడా ఉన్నతాధికారులను కోరతానని చెప్పారు. కాల్వలకు నీటిని విడుదల చేసే వరకు గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆమె సూచించారు.

ఆ పీహెచ్‌సీల్లో వైద్యులను మార్చండి

కోడూరు పీహెచ్‌సీలో పనిచేస్తున్న వైద్యుడు వివేక్ ఆసుపత్రికి వచ్చిన రోగులను పట్టించుకోవడం లేదని, కనీసం నాడి కూడా చూడట్లేదని, రోగుల పట్ల చులకనభావంతో మాట్లాడుతున్నాడని, ఆయన్ను మార్చాలని కోడూరు జెడ్పీటీసీ సభ్యుడు వై.వెంకటసత్యనారాయణ కోరారు. అలాగే, పామర్రు మండలం నిమ్మకూరు పీహెచ్‌సీలోనూ ఇదే పరిస్థితి ఉందని, అక్కడి వైద్యులు, సిబ్బంది ఆసుపత్రికి వచ్చిన వారిని పట్టించుకోవడం లేదని పామర్రు ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. వత్సవాయి పీహెచ్‌సీలోనూ ఇదే పరిస్థితి నెలకొందని వత్సవాయి జెడ్పీటీసీ సభ్యుడు అధికారులకు తెలిపారు. డీఎంఅండ్‌హెచ్‌వో గీతాబాయి మాట్లాడుతూ కోడూరు పీహెచ్‌సీలో పనిచేస్తున్న వైద్యుడి పనితీరుపై విచారణ చేశామన్నారు. నిమ్మకూరు, ఇతర పీహెచ్‌సీల వైద్యులతో తాను మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని తెలిపారు. నున్న పీహెచ్‌సీ భవనం నిర్మాణానికి నిధులు విడుదలైనా పనులు చేయడం లేదని సభ్యులు తెలిపారు.

కాల్వల నిర్వహణ పనులు చేపట్టండి

గూడూరు మండలంలోని లజ్జబండ డ్రెయిన్‌లో గుర్రపుడెక్క, జమ్ము పేరుకుపోయిందని, వాటిని నిర్మూలించేందుకు సకాలంలో రసాయనాలు పిచికారీ చేయకుంటే రైతులు ఇబ్బందులు పడతారని గూడూరు జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్‌రంగబాబు అన్నారు. కాల్వల నిర్వహణ పనులు చేయకుంటే ఖరీఫ్‌లో రైతులు ఇబ్బందులపాలవుతారని సభ్యులంతా పేర్కొన్నారు. రెండు రోజుల క్రితం నీటిపారుదల శాఖ ఉన్నతాధికారుల సమావేశం జరిగిందని, నాలుగైదు రోజుల్లో పనులకు సంబంధించిన టెండర్లు పిలిచే అవకాశం ఉందని ఎస్‌ఈ సమాధానం ఇచ్చారు.

ఉల్లిపాలెం బ్రిడ్జికి అప్రోచ్ ఎప్పుడు..?

మచిలీపట్నం-కోడూరు మండలాలను కలిపే ఉల్లిపాలెం బ్రిడ్జికి అప్రోచ్ సక్రమంగా లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, ఈ అప్రోచ్ నిర్మాణం చేపట్టాలని కోడూరు జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌అండ్‌బీ అధికారులను కోరారు. గన్నవరం-మానికొండ రహదారి గోతులుగా మారిపోయిందని, కనీస మరమ్మతులైనా చేయాలని జెడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు కోరారు. తోట్లవల్లూరు మండలంలోని దేవరపల్లిలో పాఠశాలకు వెళ్లే రహదారి అధ్వానంగా ఉందని, బాపులపాడు మండలం వేలేరు జెడ్పీ పాఠశాలకు వెళ్లే రహదారి పూర్తిగా దెబ్బతిందని, కనీస మరమ్మతులైనా చేయాలని సభ్యులు కోరారు. నాడు-నేడు పనులకు సంబంధించి పాఠశాలల్లో నిర్మాణ పనులు నిలిపివేశారని, పాఠశాలలు తెరిచే సమయానికైనా ఈ పనులు ప్రారంభించాలని సభ్యులు కోరారు. ఈ సమస్యలపై ప్రధానంగా దృష్టిసారించి పరిష్కరించాలని జెడ్పీ చైర్‌పర్సన్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జెడ్పీ ఇన్‌చార్జి సీఈవో ఆనందకుమార్, ఉమ్మడి కృష్ణాజిల్లాకు చెందిన వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చేపల చెరువులకు తాగునీరా..?

తాగునీటి అవసరాల కోసం ఏప్రిల్‌లో కాల్వలకు నీటిని విడుదలచేస్తే కృత్తివెన్ను మండలంలోని సీతనపల్లిలోని తాగునీటి చెరువును నింపకుండా చేపల చెరువులకు నీటిని మళ్లించారని కృత్తివెన్ను జెడ్పీటీసీ సభ్యురాలు షైలా రత్నకుమారి తెలిపారు. కృత్తివెన్ను మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈకి ఈ విషయం చెప్పినా పట్టించుకోలేదన్నారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఏఈ తీరుపై విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈకి సూచించారు.

అనుమానం పెనుభూతమై..

రోకలి బండతో కొట్టి భార్యను హతమార్చిన భర్త

- బందరు మండలం బొర్రపోతుపాలెంలో ఘటన



శివనాగరాణి (ఫైల్)

మచిలీపట్నం టౌన్, మే 18 : పదిహేడేళ్ల పాటు కాపురం చేసిన భార్యను రోకలిబండతో అతికిరాతకంగా హతమార్చాడు ఓ భర్త. బందరు మండలం బొర్రపోతుపాలెం గ్రామంలో శనివారం జరిగిన ఈ హత్య స్థానికంగా కలకలం రేపింది. ఆర్‌పేట సీఐ శ్రీనివాసరావు కథనం ప్రకారం.. బొర్రపోతుపాలెం గ్రామానికి చెందిన శివనాగరాజుకు, జింజేరు గ్రామానికి చెందిన శివనాగరాణి (36)తో పదిహేడేళ్ల కిందట వివాహమైంది. వీరికి ముగ్గురు పిల్లలు. రోజువారీ కూలీ చేసుకుంటూ జీవిస్తున్నారు. మొదటి నుంచి భార్యపై అనుమానంతో ఉన్న శివనాగరాజు శనివారం మరింత రెచ్చిపోయాడు. శనివారం మధ్యాహ్నం కుమార్తెతో కలిసి నిద్రపోతున్న నాగరాణిని విచక్షణారహితంగా రోకలిబండతో కొట్టాడు. కుమార్తె అనిత వద్దని వారించినా వినిపించుకోలేదు. కాళ్లు పట్టుకుని బతిమాలినా అనితను తోసేసి మరీ హత్య చేశాడు. కాగా, వీరి పెద్ద కుమార్తె అనిత బుద్దాలపాలెం హైస్కూల్‌లో 10వ తరగతిలో స్కూల్ ఫస్ట్ వచ్చింది. రెండో కుమార్తె కవిత బుద్దాలపాలెం హైస్కూల్‌లో 8వ తరగతి, కుమారుడు అర్జునరావు బొర్రపోతుపాలెం స్కూల్‌లో 5వ తరగతి చదువుతున్నాడు. తల్లి మరణంతో వీరు గుండలవిసేలా ఏడ్చారు. కాగా, సంఘటనా స్థలాన్ని డీఎస్పీ ఎండీ అబ్దుల్ సుభాన్, సీఐ శ్రీనివాసరావు, రూరల్ ఎస్ఐ వీరప్రసాద్ పరిశీలించారు. శివనాగరాణి తల్లి ఆదిలక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నాగరాజును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

పకడ్బందీగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

- ఈనెల 24 నుంచి జూన్ 1 వరకూ..
- పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్
- గూగుల్ మీట్‌లో కలెక్టర్ బాలాజీ

- 6లో..

మాపైనే ఫిర్యాదు చేస్తారా..!

ఏపీటీడీసీ డిప్యూటీ మేనేజర్ శివారెడ్డి సస్పెన్షన్


- కోడ్ ఉండగా ఉద్యోగ నియామకాలు
- కొందరు ఉద్యోగుల ఫిర్యాదులు
- ఈసీకి ఫిర్యాదు చేశారన్న కారణంతో ఉన్నతాధికారుల చర్యలు

చెత్త టార్గెట్

మళ్లీ చెత్తపన్ను వసూలు చేయాలని ఆదేశాలు

- తలలు పట్టుకుంటున్న శానిటరీ అసిస్టెంట్లు
- విజయవాడలో రూ.24 కోట్లు.. మచిలీపట్నంలో రూ.5.04 కోట్లు
- చెత్త పన్ను వసూలు చేయాలని ఒక్కసారిగా టార్గెట్లు

చెత్తపన్ను వసూళ్లపై పురపాలక సంఘాలు మళ్లీ దృష్టిపెట్టాయి. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్, మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు వైఎస్సార్ తాడిగడప, గుడివాడ, ఉయ్యూరు మున్సిపాలిటీల్లో చెత్తపన్ను వసూలు చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. విజయవాడ కార్పొరేషన్‌లో అయితే శనివారం మధ్యాహ్నం వార్డు సచివాలయాల వారీగా లక్ష్యాలను నిర్దేశించారు. సాయంత్రంలోగా ఆ మొత్తాన్ని చెల్లించేయాలని ఆదేశాలు జారీ చేశారు.



(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : వైసీపీ అధికారంలోకి వచ్చాక 2021, నవంబరు 1 నుంచి చెత్తపన్ను వసూలుకు తెరతీశారు. తొలుత నెలవారీగా వసూలు చేయాలని భావించినా ప్రజల్లో వ్యతిరేకత రావడంతో ఆస్తిపన్నుతో కలిపి ఆరు నెలలకోసారి వసూలు చేసేలా నిర్ణయం తీసుకున్నారు. అయినప్పటికీ చెత్తపన్ను చెల్లింపునకు ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. అదే సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబు.. తాము అధికారంలోకి రాగానే చెత్తపన్ను రద్దు చేస్తామని ప్రకటించారు. దీంతో తొలి నుంచి చెత్తపన్నుపై ఆగ్రహంతో ఉన్న జనం పన్ను కట్టేందుకు విముఖత చూపడం మొదలుపెట్టారు.

జనం నుంచి వ్యతిరేకత రావడంతో వెనక్కి..

విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో మొత్తం 2.85 లక్షల కుటుంబాల నుంచి చెత్త పన్ను వసూలు చేయాలని నిర్ణయించారు. నగరంలో కాల్వగట్ల పక్కన, కొండప్రాంతాలు సహా నగరంలో 109 మురికివాడలను గుర్తించారు. వీటిలో 82 వేలకుపైగా కుటుంబాలు నివాసం ఉంటున్నట్లు లెక్క తేల్చారు. వీరి నుంచి నెలకు రూ.30 చెత్తపన్ను వసూలు చేయాలని నిర్ణయించారు. మిగిలిన ప్రాంతాలు, అపార్ట్‌మెంట్లు, వాణిజ్య సముదాయాలకు నెలకు రూ.120గా నిర్ణయించారు. వాణిజ్య సంస్థల నుంచి రూ.5 వేల వరకు వసూలు చేస్తున్నారు. చెత్తపన్ను ద్వారా ఏటా రూ.45.50 కోట్లను వసూలు చేయాలని భారీ లక్ష్యాలను నిర్దేశించుకున్నారు. జనం నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో అధికారులు వెనక్కి తగ్గారు.

తాజాగా మళ్లీ..

నెలకు రూ.2 కోట్ల చొప్పున ఏటా రూ.24 కోట్ల వసూలు లక్ష్యంగా నిర్ణయించారు. ప్రస్తుతం వీఎంసీ పరిధిలో నెలకు రూ.1.2 కోట్ల చెత్తపన్ను వసూలవుతోంది. ఈ నేపథ్యంలో శనివారం మధ్యాహ్నం వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్ని వార్డు సచివాలయాలకు సర్క్యులర్ జారీ చేశారు. సాయంత్రంలోగా రూ.50 లక్షలు వసూలు చేయాలని ఆదేశించారు. అసలే చెత్తపన్ను కట్టడానికి జనాలు విముఖత చూపుతుంటే, ఈ ఒత్తిడి ఏమిటని శానిటరీ అసిస్టెంట్లు తలలు పట్టుకుంటున్నారు. మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్‌లో చెత్తపన్ను ద్వారా ఏడాదికి రూ.5.04 కోట్లు వసూలు చేయాలని లక్ష్యం కాగా, అందులో సగం కూడా వసూలు కావడం లేదు. దీంతో ఇక్కడ కూడా శానిటరీ అసిస్టెంట్లకు లక్ష్యాలను నిర్దేశించి వసూలు చేయాలని ఆదేశిస్తున్నారు. రెండు జిల్లాల్లోని మున్సిపాలిటీలన్నింటిలోనూ చెత్త పన్ను వసూళ్ల లక్ష్యాలను నిర్దేశిస్తున్నారు.

మాపైనే ఫిర్యాదు చేస్తారా..!

● ఏపీటీడీసీ డిప్యూటీ మేనేజర్ శివారెడ్డి సస్పెన్షన్ ● ఎన్నికల కోడ్ ఉండగా ఉద్యోగ నియామకాలు చేపట్టిన ఉన్నతాధికారులు
● సీ విజిల్, సీఈవో మెయిల్‌కు కొందరు ఉద్యోగుల ఫిర్యాదులు ● ఈసీకి ఫిర్యాదు చేశారన్న కారణంతో ఉన్నతాధికారులు చర్యలు ● ఉద్యోగుల జేఏసీ ఏర్పాటుపైనా గుర్రు

ఆంధ్రజ్యోతి, విజయవాడ: పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ)లో కోడ్ అమల్లో ఉండగా నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన ఉద్యోగ నియామకాలపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారన్న కారణంతో పలువురు అధికారులపై ఉన్నతాధికారులు వేటుకు రంగం సిద్ధం చేశారు. నాగార్జున సాగర్ బోటింగ్, ఎత్తిపోతల డిప్యూటీ మేనేజర్ శివారెడ్డిపై తొలి వేటు పడింది. ఈసీకి ఫిర్యాదు చేసి ఉంటారన్న అనుమానంతో ఆయన్ను సస్పెండ్ చేశారు. శివారెడ్డి సస్పెండ్ కావటంతో పర్యాటకాభివృద్ధి సంస్థ ఉద్యోగులు మండిపడుతున్నారు. శివారెడ్డి ఫిర్యాదు చేశారో, లేదో తెలియదు కానీ ఏపీటీడీసీలో జరుగుతున్న అక్రమాలు బయటకు వస్తున్నాయన్న ఉద్దేశంతో కొందరిపై ఉన్నతాధికారులు టార్గెట్ చేశారు. ఆంధ్రజ్యోతిలో కథనాలు వచ్చాయన్న పేరుతో అంతకు ముందు కూడా పలువురిని టార్గెట్‌గా చేసుకుని షోకాజు నోటీసులతో పాటు సస్పెండ్ కూడా చేశారు. ఇలా అనుమానాలతో చర్యలు తీసుకోవటాన్ని ఉద్యోగుల సంఘం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా జరిపిన నియామకాలపై ఈసీ చర్యలు తీసుకుంటుందన్న భయంతో ఉన్నతాధికారులు శివారెడ్డిని బాధ్యుడిని చేస్తూ సస్పెండ్ చేశారు. కోడ్ ఉండగా పర్యాటకాభివృద్ధి సంస్థలో నియామకాలు ఎంత వాస్తవమో, ఉద్యోగులు ఈసీకి ఫిర్యాదు చేసిన మాట కూడా అంతే నిజం. ఉద్యోగులు సీ విజిల్ యాప్‌తో పాటు, సీఈవో మెయిల్‌కు కూడా ఫిర్యాదులు చేశారు. సీ విజిల్‌లో ఫిర్యాదుపై 60 గంటల్లో చర్యలు తీసుకోవాల్సి ఉంది. కానీ ఇప్పటి వరకు ఆ దిశగా చర్యలు చేపట్టిన ఉదంతాలు కనిపించలేదు. ఈసీ ఎందుకు ప్రేక్షక పాత్ర పోషించిందన్నది చర్చనీయాంశంగా మారింది. ఈసీకి ఫిర్యాదు చేశారన్న కారణంతో ఇంకెంతమందిపై వేటు వేస్తారోనని ఉద్యోగులు భయపడుతున్నారు. ఇటీవల ఏపీటీడీసీలో బస్ ట్రాన్స్‌పోర్టు ప్రైవేటీకరణ, కాటేజీల ప్రైవేటీకరణ, కమిషన్ల కోసం కాటేజీల ఆధునీకరణ, టీటీడీ టికెట్లను ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టడం, సంస్థలో నిబంధనలకు విరుద్ధంగా ఉద్యోగ నియామకాలు చేపట్టడం, అవినీతి కార్యకలాపాలు విపరీతంగా పెరిగిపోవటం వంటివి అట్టుడికిస్తున్నాయి. వీటిపై పోరాడేందుకు ఇటీవల ఉద్యోగులంతా జేఏసీని ఏర్పాటు చేసుకున్నాయి. ఉద్యోగులంతా జేఏసీగా ఏర్పడితే తమ అక్రమాలు బయటకు వస్తాయన్న ఉద్దేశంతో వారిని భయాందోళనలకు గురి చేయాలన్న ఉద్దేశంతో ఇలాంటి చర్యలకు దిగుతున్నారన్న విమర్శలు వస్తున్నాయి.



చంద్రబాబును కలిసిన సుజనా



వన్‌టౌన్, మే 18: మాజీ సీఎం, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడును హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో విజయవాడ పశ్చిమ నియోజకవర్గం నుంచి పోటీచేసిన కూటమి బలపరచిన బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. చంద్రబాబునాయుడు ఆయన్ను సాదరంగా ఆహ్వానించారు. వారిద్దరి మధ్య ఇటీవల జరిగిన పోలింగ్ సరళి, విజయావకాశాలు వంటి అంశాలు చర్చకు వచ్చినట్టు సమాచారం.

పవన్ రాజకీయాల్లో రాణిస్తారు

● సినీనటి ప్రణీత

విజయవాడ, మే 18 (ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత పవన్ కల్యాణ్ భవిష్యత్తులో రాజకీయాల్లో రాణిస్తారని సినీనటి ప్రణీత అన్నారు. ఆయనలో ప్రజలకు మంచి చేయాలన్న ఆకాంక్ష బలంగా ఉందన్నారు. ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు శనివారం విజయవాడ వచ్చిన ఆమె ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. పవన్ కల్యాణ్‌తో అత్తారింటికి దారేది చిత్రంలో నటించానని, ఆయన నటనలోనే కాకుండా రాజకీయాల్లోనూ రాణిస్తారన్నారు. పవన్ కల్యాణ్‌తో మరోచిత్రంలో నటించాలని ఉందన్నారు.

నేనైతే ఈ పగుళ్లు దాటలేను!

● ఏపీ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ పద్మావతి

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]



నార్తువల్లూరు ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం ప్రధాన ద్వారం వద్ద భారీ పగుళ్లను పరిశీలిస్తున్న ఏపీ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ పద్మావతి

తోట్లవల్లూరు, మే 18: 'నేనైతే ఈ మెట్ల పగుళ్లు దాటలేను' అని నార్తువల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని చూసిన ఏపీ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ కె పద్మావతి అన్న మాటలివి. ఆంధ్రజ్యోతి దినపత్రికలో శనివారం 'పీహెచ్‌ఎస్‌సీలోకి వెళ్లాలంటే గర్భిణులు, బాలింతలకు ప్రయాసే' అన్న శీర్షికతో వార్తా కథనం వచ్చిన విషయం విదితమే. ఈ వార్తకు స్పందించిన ఏపీ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ పద్మావతి శనివారం ఉదయం తోట్లవల్లూరు వచ్చి నార్తువల్లూరు ఆరోగ్య ఉపకేంద్రాన్ని సందర్శించి అధ్వాన్న స్థితిని పరిశీలించారు. లోపలికి ప్రవేశించే ప్రధాన మెట్ల మార్గం భారీ పగుళ్లతో ఉండటాన్ని చూసి ఈ పగుళ్లు నేను దాటలేనంటూ ఏఎన్ఎం సహాయం తీసుకోవాల్సి వచ్చింది. లోపల గదుల్లో కుంగి చెదలు పట్టిన ఫ్లోరింగ్‌ని చూశారు. బయట అరుగును పరిశీలించారు. అంతా పాడైపోయాయయని, చాలా ప్రమాదకర పరిస్థితులున్నాయని ఆమె వ్యాఖ్యానించారు. లోపల పాములు సంచరిస్తున్నాయని, తాము తీవ్ర భయానక పరిస్థితిని ఎదుర్కొంటున్నామని, గర్భవతులు, బాలింతలు ఇబ్బంది పడుతున్నారని సిబ్బంది పద్మావతికి వివరించారు. ఈ ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రానికి చేయాల్సిన మరమ్మతుల అంశాన్ని సంబంధిత శాఖకు నివేదిస్తానని పద్మావతి తెలిపారు. అయితే గ్రామస్థుల సహకారం తీసుకుని తక్షణమే పగుళ్లను గ్రావెల్ వేయమని కోరాలని ఏఎన్‌ఎంకు సూచించారు. ఈ భవనంలోకి రాలేకుంటే గర్భవతులు, బాలింతల ఇళ్లకే వెళ్ళి వైద్య సహాయం అందించాలని కోరారు. అనంతరం రికార్డులు పరిశీలించి అందుబాటులో ఉన్న మందులను తనిఖీ చేశారు. రాబోయేది వర్షాకాలం కానుక అతిసార వ్యాధి మందులు, సెలైన్ బాటిళ్లు, అన్ని మందులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. పీహెచ్ఎన్ పద్మావతి, ఏఎన్‌ఎం వీ కమలాక్షి సిబ్బంది పాల్గొన్నారు.



కుంగిపోయిన అరుగును పరిశీలిస్తున్న పద్మావతి

బంకు తగులబెట్టేస్తాం



పెట్రోల్ బంకు సిబ్బందితో గొడవ పడుతున్న బ్లేడ్ బ్యాచ్ సభ్యుడు

● లూజు పెట్రోల్ పోయాలంటూ బ్లేడ్‌బ్యాక్ సభ్యుడి హుకుం
● బందరు రోడ్డులోని ఒక పెట్రోల్ బంకు నిర్వాహకులను బెదిరించిన వైనం
● ఎన్నికల దృష్ట్యా లూజు పెట్రోల్ పోయొద్దని ఎన్నికల సంఘం ఆదేశాలు

వన్‌టౌన్,మే 18: సీసాలో లూజు పెట్రోల్ పోయకపోతే రాత్రికి రాత్రికే పెట్రోల్ బంకును తగులబెడతామని ఒక బ్లేడ్‌బ్యాచ్ సభ్యుడు బెదిరించిన వైనం శనివారం బందరు రోడ్డులో సూపర్‌మార్కెట్ ఎదురుగా ఉన్న పెట్రోల్ బంకు వద్ద జరిగింది. బ్లేడ్‌బ్యాచ్ సభ్యులు సీసా పట్టుకుని పెట్రోల్ పోయమనడం, సిబ్బంది నిరాకరించడం, వారిని బ్లేడ్‌బ్యాచ్ సభ్యులు బెదిరించడం సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. వీటి ఆధారంగా గవర్నర్‌పేట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. బంకు మేనేజర్ వద్ద ఫిర్యాదు తీసుకుని బ్లేడ్ బ్యాచ్ సభ్యుల కోసం గాలిస్తున్నారు. తొలుత పెట్రోల్ బంకుకు వద్దకు వచ్చిన వ్యక్తి సీసాలో పెట్రోల్ పోయమని అడిగాడు, సిబ్బంది వీలుపడదని చెప్పడంతో వారితో అతను వాదులాడాడు. అంతేకాక పెట్రోల్ పోయకపోతే రాత్రికి రాత్రే పెట్రోల్ బంకును తగులబెడతామని హెచ్చరించడంతో సిబ్బంది భయభ్రాంతులకు గురయ్యారు. దీంతో పోలీసులకు సమాచారం అందించారు. సీఐ వెంకటరమణ బంకు వద్దకు వచ్చి సమాచారం సేకరించారు. రిపోర్టు తీసుకుని బ్లేడ్ బ్యాచ్ సభ్యుల్ని పట్టుకునేందుకు రెండు బృందాలను నియమించారు. ఇదిలా ఉండగా ఎన్నికల అనంతరం పలుచోట్ల జరుగుతున్న గొడవల దృష్ట్యా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నివారించేందుకు లూజు పెట్రోల్‌ను పోయవద్దని, కేవలం బండ్లలోనే పోయాలని ఎన్నికల సంఘం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎవరైనా ఉల్లంఘిస్తే బంకు అనుమతులను రద్దుతో పాటు చర్యలను తీసుకుంటామని తెలిపింది. దీంతో అన్ని పెట్రోల్ బంకులు లూజు పెట్రోల్ పోయడాన్ని నిలిపేశాయి. పెట్రోల్ బంకు వద్ద జరిగిన సంఘటన నేపథ్యంలో గవర్నరుపేట సీఐ వెంకటరమణ తన పరిధిలోని పెట్రోల్ బంకువారితో అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. ఎన్నికల అనంతరం జరుగుతున్న గొడవలను దృష్టిలో పెట్టుకుని పెనుప్రమాదాలను నివారించేందుకు లూజుగా పెట్రోల్ పోయవద్దని, ఎవరైనా అడిగితే తమకు సమాచారం ఇవ్వాలని మార్గదర్శకాలను జారీ చేశారు. ఈ సమావేశంలో ఎస్ఐలు నారాయణమ్మ, కృష్ణబాబు పాల్గొన్నారు.



పోలీసు స్టేషన్‌లో పెట్రోల్ బంకు నిర్వాహకులతో సమావేశం

పైకి గెలుపు గాంభీర్యం లోపల అనుమానం


● అధికారం తథ్యమంటూ వైసీపీ శ్రేణుల ప్రగల్భాలు
● టీడీపీకే ఓటర్లు పట్టం కట్టారంటూ కూటమి నేతల ధీమా



పామర్రు: ఎస్సీ రిజర్వు నియోజకవర్గమైన పామర్రులో అధికారం మాదంటే మాదేనంటూ అధికార వైసీపీ, ప్రతిపక్ష టీడీపీ ధీమా వ్యక్తం చేస్తున్నాయి. కులమతాలకు అతీతంగా పేదలకు అందించిన పింఛన్లు, ఇతర సంక్షేమ పథకాలతో వైసీపీ అభ్యర్థి రెండోసారి గెలుపొందటం ఖాయమని ఆ పార్టీ శ్రేణులు ప్రగాల్భాలు పలుకుతుండగా, వారికి దీటుగా ఎన్డీయే కూటమికి చెందిన టీడీపీ, జనసేన, బీజేపీ వర్గాలు గత ఐదేళ్ల వైసీపీ పాలనతో అభివృద్ధిని విస్మరించి ఇసుక, పేదల ఇళ్లస్థలాల్లో జరిగిన అవినీతి పాలనకు ప్రజలు విసుగు చెంది ఉన్నారని, అంతేకాక ప్రభుత్వ మార్పును కోరుకుంటున్నారని, చంద్రబాబు పేదల సంక్షేమానికి పెట్టిన సూపర్ సిక్స్ పథకాల పట్ల ఆకర్షితులై సైకిల్, గాజు గ్లాసు గుర్తుకు అధికంగా ఓట్లు వేశారనే ధీమాతో ఉన్నారు. అంతేకాక నియోజవర్గంలో అధికంగా ఉన్న ఓ బలమైన సామాజిక వర్గానికి చెందిన యువ ఓటర్లతోపాటు, ఆ కులానికి చెందిన వారి ఓటుబ్యాంకు నూటికి 80 శాతం ఈసారి టీడీపీకి లభించిందని దాంతో ఈసారి టీడీపీ గెలుపును ఆపడం ఎవరి తరం కాదంటున్నారు. 2019లో 87.44 శాతంగా ఉన్న ఓటింగ్ శాతం ప్రస్తుత 88.11 శాతంగా నమోదై జిల్లాలోనే రెండోస్థానంలో అత్యధిక శాతం నమోదైంది. మహిళల ఓట్లు కూడా గతం కంటే ఎక్కువగా నమోదైంది. దీంతో ప్రజలు తమకే అనుకూలంగా తీర్పునిచ్చారని గ్రామాల్లో ఇరుపార్టీలు ఆశాభావం వ్యక్తం చేశాయి. నియోజకవర్గంలో ఎస్సీల తరువాత అధికంగా ఉన్న కాపు, బీసీ వర్గాల ఓట్లు వైసీపీకి పడినట్టు జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని కూటమి నేతలు స్పష్టం చేస్తున్నారు. ముస్లిం మైనార్టీ, ఆర్య వైశ్య, బ్రాహ్మణ ఓటర్లు నూటికి నూరు శాతం వైసీపీ వైపునే ఉన్నారని, ఇది తమ పార్టీ గెలుపునకు తోడ్పడతాయంటున్నారు. ఇదిలా ఉండగా టీడీపీ సైతం మాజీ సీఎం చంద్రబాబు పామర్రులో నిర్వహించిన ప్రచారంతో పార్టీనేతలు కలిసికట్టుగా పనిచేశారని, అందుకే ఆయా వర్గాలు తమ అభ్యర్థికే ఓటు వేశారని చెబుతున్నారు. అధికార పార్టీ అభ్యర్థి చేసిన తప్పిదాల కారణంగా ఆ పార్టీలోని కొందరు నేతలు సహకరించి తమ పార్టీ గెలుపునకు చేయూతనిచ్చారని టీడీపీ వర్గాలు బాహాటంగానే చెబుతున్నాయి. ఏదిఏమైనా జూన్4న ఫలితాలు వెలువడే వరకు ఉత్కంఠ కొనసాగుతూనే ఉంటుంది. నేతలు మాత్రం పైకి విజయం మాదేనంటూ గాంభీర్యం ప్రదర్శిస్తున్నప్పటికీ ఎక్కడో అనుమానం ఆందోళన వెంటాడుతూనే ఉంది.

విజయావకాశాలపై విస్తృత సమీక్షలు

ఇదిలా ఉండగా అసెంబ్లీ స్థానాలకు పోటీచేసిన అభ్యర్థుల కార్యాలయాల్లో విజయావకాశాలపై విస్తృత సమీక్షలు నిర్వహించేందుకు పొలిటికల్ ఆడిటర్లు రంగంలోకి దిగారు. గ్రామాలు, బూత్‌ల వారీగా ఏ అభ్యర్థికి ఎన్ని ఓట్లు పోలయ్యాయోనని బూత్ ఏజెంట్లు గ్రామస్థాయి నేతలతో సమీక్షలు చేస్తున్నారు. ఇందులో భాగంగా ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎక్కడ వీక్‌గా ఉన్నారనే అంశాలపై చర్చలు జరుపుతూ బిజీగా ఉన్నారు. బూత్‌ల వారీగా పోలైన ఓట్లు, ప్రత్యర్థి పార్టీకి ఎన్ని, అనుకూలంగా ఎన్ని పోలయ్యాయనే అంచనాల్లో తల మునకలై ఉన్నారు. ఫలితాలకు ఇంకా పక్షం రోజుల పైనే వ్యవధి ఉండటంతో అభ్యర్థులతో పాటు ఓటర్లలోనూ ఉత్కంఠ నెలకొంది. నియోజకవర్గంలో ఐదు మండలాల్లో తోట్లవల్లూరులో వైసీపీ కొంతబలంగానే ఉన్నట్టు, మొవ్వలో కొన్ని గ్రామాలు వైసీపీ ప్రభావం ఉన్నా చివరికి సల్ప అధికృత టీడీపీకే ఉంటుందని, పెదపారుపూడి 50-50గా నిలిచినా, పమిడిముక్కల, పామర్రు మండలాల్లో అత్యధిక మెజార్టీ టీడీపీదేనని పొలిటికల్ ఆడిటర్లు లెక్కలు వేసినట్టు తెలుస్తోంది. ఈ ఉత్కంఠ చివరకు భారీస్థాయిలో బెట్టింగ్‌కు దారితీస్తుందని విశ్లేషకులు చెబుతున్నారు. ఇప్పటికే బెట్టింగ్ రాయుళ్లు రంగంలోకి దిగినట్టు తెలుస్తోంది. అయితే బెట్టింగుల్లోనూ వైసీపీ గెలుపుపై పందెం కాసేందుకు పందెం రాయుళ్లు కొంత వెనకడుగు వేస్తున్నట్టు భోగట్టా.



ప్రబీర్ పుర్కాయస్థ ఆత్మకథ 'అలుపెరుగని పోరాటం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న గోళ్ల నారాయణరావు, నల్లూరి మాధవరావు, కేఎస్ లక్ష్మణరావు, సుంకర రాజేంద్రప్రసాద్ తదితరులు

ప్రబీర్ అరెస్టుపై సుప్రీంతీర్పు హర్షణీయం

● ఐలు నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర రాజేంద్రప్రసాద్

గవర్నర్‌పేట, మే 18: న్యూస్‌వీక్ వ్యవస్థాపకుడు ప్రబీర్ పురకాయస్థ అరెస్టు చెల్లదని సుప్రీంకోర్టు తీర్పునివ్వడం స్వాగతిస్తున్నామని ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు) నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర రాజేంద్రప్రసాద్ అన్నారు. ప్రబీర్ పుర్కాయస్థ అక్రమ అరెస్టుపై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తూ ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు), రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక, పోలవరపు సాంస్కృతిక సమితి సంయుక్త ఆధ్వర్యంలో శనివారం రాత్రి ఎంజీ రోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో సభ జరిగింది.

ఈ సందర్భంగా సుంకర మాట్లాడుతూ ఉగ్రవాద నిరోధక చట్టం కింద ప్రబీర్‌ను ఢిల్లీ పోలీసులు అరెస్టు చేయడాన్ని తప్పుపడుతూ సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పునిస్తూ తక్షణమే ఆయన్ని విడుదల చేయాలని ఆదేశించడం సముచిత తీర్పు అన్నారు. రిమాండ్ కాపీని సమర్పించలేదన్న సుప్రీంకోర్టు, రిమాండ్ ఆదేశాలు చెల్లవని తీర్పులో స్పష్టం చేసినట్లు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ప్రబీర్ పుర్కాయస్థ ఆత్మకథ అలుపెరుగని పోరాటం ఆవిష్కరణ జరిగింది. ప్రజాశక్తి బుక్ హౌస్ పూర్వ సంపాదకులు కె.ఉషారాణి పుస్తకాన్ని పరిచయం చేశారు. సభలో సిద్ధార్థ లా కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ దివాకర్‌బాబు, ఐలూ ప్రధాన కార్యదర్శి నల్లూరి మాధవరావులు, గోళ్ల నారాయణరావు తదితరులు ప్రసంగించారు.

పచ్చిరొట్ట విత్తనాల సరఫరా: జిల్లా వ్యవసాయాధికారిణి

కంచికచర్ల, మే 18: ఖరీఫ్ సీజన్‌లో భూమి సత్తువని, పంట ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంపొందించేందుకు పశువుల ఎరువుకు ప్రత్యామ్నాయంగా 50శాతం రాయితీపై పచ్చిరొట్ట పైర్ల విత్తనాలు సరఫరా చేయనున్నట్టు జిల్లా వ్యవసాయాధికారిణి ఎస్.నాగమణెమ్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాకు జీలుగ విత్తనాలు 3710 క్వింటాళ్లు, పిల్లిపెసర విత్తనాలు 1,333 క్వింటాళ్లు, జనుము 149 క్వింటాళ్లు, వెరశి 5,192 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు ఈ నెల 25 నాటికి రైతులకు అందుబాటులో ఉంచుతామన్నారు. జీలుగ, జనుము కిలో రూ. 88 కాగా 50 శాతం రాయితీపై రూ.44లకు, పిల్లిపెసర కిలో రూ.134 కాగా రూ. 67కు అందిస్తామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని, తొలకరి వర్షాలు పడగానే పచ్చిరొట్ట పైర్లు వేసుకోవాలన్నారు. ఖరీఫ్ పంటకాలానికి జిల్లాకు 74,823 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమని అంచనా వేయగా, ఇప్పటికే 46,251 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. నకిలీల బారిన పడకుండా ఉండేందుకు విత్తనాలు కొనే సమయంలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఏదైనా సమస్య వచ్చినట్టయితే మండల వ్యవసాయాధికారుల దృష్టికి తీసుకురావాలని జిల్లా వ్యవసాయాధికారిణి నాగమణెమ్మ విజ్ఞప్తి చేశారు.

రంగమ్మ తొలగింపునకు రాజకీయ కారణాలు కాదు

● ఎంపీడీవో విశ్వనాథ్, ఏపీవో శరత్

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

నందిగామ రూరల్, మే 18: మండలంలోని గోళ్లమూడి గ్రామంలో బరిగెల రంగమ్మ భర్త వీరయ్య టీడీపీకి ఓటేశారని ఉపాధి హామీ పథకంలో తన పేరు తీసేశారని రంగమ్మ ఆంధ్రజ్యోతికి తెలపటంతో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. శనివారం ఆమెకు పని కల్పించారు. ఆమె తొలగింపునకు రాజకీయ కారణాలు కాదని ఎంపీడీవో విశ్వనాథ్, ఏపీవో శరత్ తెలిపారు. ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనాలతో అధికారులు స్పందిస్తూ ఉపాధి హామీ పథకం గ్రామ క్షేత్ర సహాయకుడు నంద్రు కాటయ్య ఈ నెల 13,14న ఎన్నికల విధుల నిమిత్తం విజయవాడ వెళ్లాడని, దీనిపై సంజాయిషీతో కూడిన లిఖితపూర్వక వివరణ అందించాడన్నారు. అంతేకాక ఎన్నికల విధుల్లో ఉండటం, అలసట, నిద్రలేమితో కొంత మందికి పని కల్పించలేకపోయామని తెలిపారు. రంగమ్మకు ఇప్పటి వరకు 5రోజులకు ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి రూ.1300 వేతనం చెల్లించినట్టు చెప్పారు. రంగమ్మకు గ్రామంలోని పంట కాల్వ పూడికతీత పనులు కేటాయించినట్టు తెలిపారు. అందరితో పాటు తనకు ఉపాధి హామీ పథకం పనులు కల్పించిన ఆమె ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు.



పంట కాల్వ పూడికతీత పనుల్లో రంగమ్మ

పశుపోషణలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

చిట్టినగర్/కాటూరు (ఉయ్యూరు), మే 18: ఇంజనీరింగ్ పూర్తిచేసిన యువకులు ఐటీ కంపెనీల్లో స్థిరపడాలనుకుంటున్న రోజులివి. అలాంటిది ఇంజనీరింగ్ పూర్తిచేసిన ఓ యువకుడు పశుపోషణలోకి దిగాడు. ఉయ్యూరు మండలం కాటూరు గ్రామానికి చెందిన వి.సృజన్ మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తి చేశారు. అడాప్ట్ ఐటీ సొల్యూషన్స్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ పశుపోషణపై ఆసక్తితో రెండు గేదెలను కొనుగోలు చేశాడు. గేదెల నుంచి సేకరించిన 6 లీటర్లను పాలను కృష్ణా మిల్క్ యూనియన్‌కు సంబంధించిన కాటూరు సొసైటీకి సరఫరా చేస్తున్నాడు. ఆయన్ను మిల్క్ యూనియన్ అధ్యక్షుడు చలసాని ఆంజనేయులు శనివారం కలిసి సత్కరించారు.

పశుపోషణపై ఆసక్తి అభినందనీయం: చైర్మన్

విద్యావంతులైన యువకులు పాడి పరిశ్రమ వైపు ఆకర్షితులు కావడం అభినందనీయమని కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయలు అన్నారు. సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ పశుపోషణపై ఆసక్తి పెంచుకున్న సృజన్ గురించి ఆయన వివరాలు తెలుసుకున్నారు. శనివారం ఆయన పాలకేంద్రాన్ని సందర్శించిన సందర్భంలో సృజన్‌ను కలిసి పాడిరైతుల సంక్షేమానికి యూనియన్ అమలుచేస్తున్న పథకాలు, పాలధర వంటి అంశాలపై అభిప్రాయం అడిగి తెలుసుకున్నారు. పాలసేకరణ ధర, బోనస్, సంక్షేమ పథకాలు, టెక్నికల్ ఇన్‌పుట్స్ ఎంతగానో తోడ్పడుతున్నాయని సృజన్ తెలిపారు. పాడిపరిశ్రమపై ఉన్న మక్కువతో భవిష్యత్తులో మరిన్ని పశువులు సమకూర్చుకుని డెయిరీఫామ్ ఏర్పాటు చేయాలన్నది లక్ష్యమని చైర్మన్‌కు వివరించారు. మరిన్ని పశువులను ఏర్పాటు చేసుకుని పరిశ్రమ విస్తరింపజేసేందుకు యూనియన్ తరపున సహాయ సహకారాలు అందిస్తామని, విద్యావంతులైన యువకులు పాడిరంగం వైపు ఆకర్షితులు కావడం అభినందనీయమని సృజన్‌ను ఆదర్శంగా తీసుకుని యువకులు ముందుకొచ్చి డెయిరీ ఫారమ్‌లు ఏర్పాటుచేసి పాడి పరిశ్రమ అభివృద్ధికి తోడ్పడాలని చైర్మన్ పిలుపునిచ్చారు.

అభినందించిన కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్



యువ పాడిరైతు సృజన్‌ను సత్కరిస్తున్న కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు

పకడ్బందీగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు: కలెక్టర్

మచిలీపట్నం: ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు పక్బందీగా నిర్వహించాలని కలెక్టర్ డీకే బాలాజీ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ క్యాంప్‌కార్యాలయం నుంచి గూగుల్‌మీట్ ద్వారా శనివారం ఆయన విద్యాశాఖాధికారులతో ఆయన మాట్లాడారు. ఈనెల 24 నుంచి జూన్ 1 వరకు ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతాయన్నారు. ఈ నేపథ్యంలో పరీక్షా కేంద్రాల వద్ద పూర్తిస్థాయి ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లాలో 27 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఫస్టియర్ విద్యార్థులు 8,968 మంది, సెకెండియర్ విద్యార్థులు 1,373 మంది ఉన్నారన్నారు. జూనియర్ ఇంటర్ విద్యార్థులకు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, సీనియర్ ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. ఆయా కేంద్రాలవద్ద పోలీస్ బందోబస్తు, 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. ఫ్లయింగ్‌స్క్వాడ్ బృందాలతో నిత్యం పర్యవేక్షణ చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద వెబ్‌కాస్టింగ్, సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేయాలన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని తాగునీరు, వైద్యసిబ్బందిని పరీక్షా కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచాలన్నారు. డీఆర్వో కే చంద్రశేఖరరావు, ఆర్ఐవో రవి కుమార్, స్పెషల్‌బ్రాంచ్ సీఐ వెంకటరమణ, డీఈవో తాహెరాసుల్తానా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	159, 168, 179
చికెన్ విత్ స్కిన్	310
చికెన్ స్కిన్‌లెస్	320

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.5.40

రైతులకు అందుబాటులో జీలుగ విత్తనాలు

పెనమలూరు, మే 18 : మండలంలోని అన్ని ఆర్బీకేల్లో 75 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారిణి శైలజ తెలిపారు. ప్రస్తుత వాతావరణం పచ్చిరొట్ట పంటకు చాలా అనుకూలమని, ఒక్కో ఎకరానికి 16కిలోల జీలుగ విత్తనాలను విత్తి నెలన్నర పెరగనిచ్చి భూమిలో కలియదున్నాలని రైతులకు సూచించారు. జీలుగ విత్తనాలను 50శాతం సబ్సిడీపై రైతులు పొందవచ్చన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఏవో శైలజ

సామాజిక సేవకే ప్రథమ ప్రాధాన్యం



చిన్నారులకు పాదరక్షలు అందజేస్తున్న లంక రమేష్

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మే 18 : సామాజిక అవసరాలను గుర్తెరిగి సేవలందించడమే ప్రథమ ప్రాధాన్యతగా మమతలపందిరి సేవా సమితి కార్యక్రమాలు చేపడుతుందని వ్యవస్థాపక అధ్యక్షుడు లంక రమేష్ అన్నారు. వీరవల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు, వృద్ధులకు పాదరక్షలను శనివారం అందజేశారు. సమాజం లోని అవసరాలు గుర్తించి సహృదయులైన దాతల సహకారంతో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. త్వరలోనే 100వ కార్యక్రమంగా జాతీయ రహదారులతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రధాన రహదారుల వెంబడి చెట్లు నాటేందుకు కార్యాచరణ సిద్ధం చేసినట్లు రమేష్ తెలిపారు. ఉపాధ్యక్షుడు వీసం శ్రీనివాస్ సహకారంతో 300 మందికిపైగా వృద్ధులు, చిన్నారులు, యాచకులకు పాదరక్షలు అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈడ్పుగంటి విజయలక్ష్మి, కొడాలి అనురాధ, పడమట రామకృష్ణ, రత్నకుమారి, పరుచూరి రామకృష్ణ, నిమ్మగడ్డ ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

పెనమలూరు, మే 18 : ఆసుపత్రికి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లిన బాలిక అదృశ్యంపై తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కానూరు మురళీనగర్‌కు చెందిన మహిళకు ముగ్గురు పిల్లలు. పెద్దమ్మాయి(17) దగ్గర్లోని ఆసుపత్రిలో పని చేస్తోంది. ఈ నెల 15న ఆసుపత్రికి వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లిన బాలిక ఎంతకీ రాకపోవడంతో అంతటా వెతికి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇంటర్ విద్యార్థిని అదృశ్యంపై..

కానూరు బందరు జాతీయ రహదారిపై ఉన్న ఒక ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కానూరుకు చెందిన విద్యార్థిని సరిగా చదవడం లేదని తల్లి మందలించడంతో ఈ నెల 15న ఇంటి నుంచి వెళ్లిపోయింది. బంధువులను విచారించినా ఆచూకీ తెలియక పోవడంతో తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

నేత్రపర్వంగా మండలాభిషేకం



హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

ఉయ్యూరు, మే 18 : వేణుగోపాలస్వామి, పంచ పట్టాభిరామస్వామి ఆలయంలో శనివారం లోక కళ్యాణార్థం మండలాభిషేకం నేత్రపర్వంగా నిర్వహించారు. ఉయ్యూరు పట్టణంలో నూతనంగా నిర్మించిన దేవాలయాల్లో వేణుగోపాలస్వామి, పంచ పట్టాభిరామస్వామి, రాజ్యలక్ష్మి ఇతర పరివార దేవతల విగ్రహాలు పునఃప్రతిష్ఠ చేసి 40 రోజులు అయిన సందర్భంగా దేవతా మూర్తులకు లోక కళ్యాణార్థం మండలాభిషేకం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలుపూజలు, హోమం జరిపించారు. ఆలయ పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

నేడు పూర్వ విద్యార్థులతో ముఖాముఖి

ఉయ్యూరు, మే 18 : ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాలలో ఆది, సోమవారం నేషనల్ ఎసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (నాక్) బృందం పర్యటన సందర్భంగా కళాశాల పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులతో ఆదివారం కళాశాల ఆవరణలో ముఖాముఖి ఏర్పాటు చేసినట్టు ప్రిన్సిపాల్ వి. శ్రీరామ్ తెలిపారు. పూర్వవిద్యార్థులు, తల్లిదండ్రులు సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం



కానూరు మెయిన్ రోడ్డుపై నిలిచిపోయిన నీరు

గన్నవరం, మే 18 : మండలంలో కురిసిన కొద్దిపాటి వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. శనివారం ఉదయం పడిన వర్షానికి మట్టి రోడ్లు బురద కయ్యలుగా మారాయి. గన్నవరం జాతీయ రహదారి యాదవుల రామాలయం ఎదురుగా, దుర్గాపురం మదర్‌సా ఎదురు, బుద్ధవరం బస్టాండ్, వీఎన్‌పురం కాలనీ తదితర ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఆయా ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

పెనమలూరు : కానూరులో శనివారం ఉదయం కురిసిన వర్షానికి రోడ్లు జలమయం అయ్యాయి. కానూరు ప్రధాన రోడ్డులో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో రోడ్డుపైనే నీరు నిలిచిపోయింది. దీంతో పాదచారులు, ద్విచక్రవాహనదారులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు.

గుడివాడ : పేరు గొప్ప.. ఊరు దిబ్బ అనే సామెత గుడివాడ నియోజకవర్గానికి సరిగ్గా సప్పుతుంది. పట్టణంలోని ప్రధాన రహదారులన్నీ గోతులమయంగా మారాయి. మామూలు సమయాల్లోనే ఈ రహదారుల్లో ప్రయాణం నరకమే. చిన్నపాటి వర్షానికే పట్టణంలోని ప్రధాన రహదారులన్నీ నీటమునుగుతున్నాయి.

గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు

ఉయ్యూరు/ ఉంగుటూరు/ గన్నవరం, మే 18 : గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలని, విద్యార్థి దశనుంచి గ్రంథాలయాలను ఉపయోగించుకుని విజ్ఞానం సముపార్జించుకోవాలని రిసోర్స్ పర్సన్ కె. నాగస్వామి అన్నారు. ఉయ్యూరు శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా శనివారం విద్యా ర్థులకు గ్రంథాలయాల ఉపయోగాలు తెలియజేసి పుస్తక పఠనం వల్ల కలిగే ప్రయోజనాలు తెలియ జేశారు. గ్రంథాలయ అధికారి రమణి తదితరులు పాల్గొన్నారు.



గ్రంథాలయాల ఉపయోగాలు, పుస్తకపఠనంపై విద్యార్థులకు వివరిస్తున్న రిసోర్స్ పర్సన్ నాగస్వామి

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

గ్రంథాలయాలు విద్యార్థుల జ్ఞానసముపార్జన, సామాజిక వికాసానికి ఎంతగానో దోహదపడుతున్నాయని, ప్రతి విద్యార్థి గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని ఉంగుటూరు, మానికొండ, ఆత్కూరు, తేలప్రోలు గ్రంథాలయాధికారులు యు. చంద్రశేఖరరావు, ఎల్.హరికృష్ణ, బీవీ కృష్ణారావు, బి.శ్రీనివాసరావు అన్నారు. గ్రంథాలయాల్లో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరాల్లో భాగంగా శనివారం మండలంలోని నాలుగు గ్రంథాల యాల్లో విద్యార్థులకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించారు. మానికొండ గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి ఆధ్వర్యంలో విద్యార్థులకు గణితంలో పజిల్స్, సుడోకు, చదరంగం, క్యారమ్స్ వంటి మనోల్లాసం కలిగించే ఆటలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాల విశిష్టత, పుస్తకపఠనం ఆవశ్యకత గురించి ఆయన విద్యార్థులకు వివరించారు. ఉంగుటూరు గ్రంథాలయంలో నిర్వహించిన పుస్తకపఠనం, డ్రాయింగ్ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. రోజులో కనీసం ఒక గంట సేపయినా గ్రంథాలయాలకు వచ్చి చదవడం అలవాటు చేసుకోవడం ద్వారా ఎన్నో కొత్త విషయాలు నేర్చుకో వచ్చని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్ర మంలో విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.



ఉంగుటూరులో డ్రాయింగ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

పిల్లలను గ్రంథాలయానికి పంపాలి

గన్నవరం గ్రేడ్-1 గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం ప్రారంభమయ్యిందని ఇన్‌చార్జి డి.బాబూరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ శిబిరం జూన్ 7వ తేదీ వరకూ కొనసాగుతుందని తెలిపారు. విద్యార్థులకు పుస్తక పఠనంతో పాటు పలు సబ్జెక్టుల్లో అవగాహన కల్పించటం జరుగుతుందని, తమ పిల్లలను తల్లిదండ్రులు గ్రంథాలయానికి పంపాలని కోరారు.

మాజీ ఎంపీ కొనకళ్లకు పలువురి పరామర్శ



కొనకళ్లను పరామర్శిస్తున్న తెలుగు మహిళ నాయకులు

కంకిపాడు, మే 18 : ప్రజానాయకుడు మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ త్వరగా కోలుకోవాలని తెలుగు మహిళ మండల ప్రధాన కార్యదర్శి కల్యాణి అన్నారు. విజయవాడలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో శనివారం ఆయనను కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా కల్యాణి మాట్లాడుతూ, ప్రజా సమస్యలపై నిరంతరం ఉద్యమించే నాయకులు కొనకళ్ల నారాయణ అన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన విశేష కృషి చేశారన్నారు. ఆమె వెంట స్థానిక తెలుగు మహిళ నాయకురాలు అన్నవరపు శివపార్వతి తదితరులు ఉన్నారు. స్థానిక మైనార్టీ నాయకుల ఆధ్వర్యంలో కొనకళ్లకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరాలని మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. టీడీపీ సీనియర్ నాయకులు షేక్ సలీం, సుబాని, మౌలాలి, మస్తాన్, హజరత్ ఖాదర్ ప్రార్థనలో పాల్గొన్నారు.

రెచ్చగొట్టే వాఖ్యలు చేస్తే కఠిన చర్యలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మే 18 : ఎన్నికల ప్రక్రియ ముగిసేంత వరకూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యాఖ్యలు చేయకూడదంటూ వీరవల్లి పోలీసులు టీడీపీ నాయకులకు శనివారం సెక్షన్ 149 సీఆర్పీసీ నోటీసు జారీ చేశారు. రంగన్నగూడెంలో ఆళ్ల గోపాలకృష్ణకు, టీడీపీ మండల అధ్యక్షుడు దయా ల రాజేశ్వరరావు, తదితర టీడీపీ నాయకులతో పాటు వైసీపీ నాయకులు, మొత్తం 10 మందికి వీరవల్లి పోలీసులు నోటీసులు జారీ చేశారు. అమలులో ఉన్న ఎన్నికల నియమావళిని ఉల్లంఘించరాదని నోటీసులో పేర్కొన్నారు. ప్రస్తుతం సున్నిత వాతావరణం నెలకొన్న నేపథ్యంలో ప్రజాజీవితానికి భంగం కలిగేలా ఉద్రిక్తత లను, విపక్షం వారిని రెచ్చగొట్టే విధంగా బహిరంగ వాఖ్యలు చేసినా, ప్రెస్‌మీట్‌లు పెట్టినా చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఎస్సై చిరంజీవి హెచ్చరించారు.



టీడీపీ నేత ఆళ్ల గోపాలకృష్ణకు నోటీసు అందజేస్తున్న పోలీసులు

గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండాలి

● పమిడిముక్కల ఎస్సై శ్రీనివాసరావు

పమిడిముక్కల, మే 18 : గ్రామాల్లో ప్రశాంత వాతావరణానికి విఘాతం కలిగించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పమిడిముక్కల ఎస్సై శ్రీనివాసరావు హెచ్చరించారు. మం టాడలో శనివారం స్థానికులతో ఆయన మాట్లాడారు. ఎన్నికల కోడ్, 144 సీఆర్పీసీ, సెక్షన్ 30 అమలులో ఉన్నందున ఏ ప్రాంతంలో కూడా నలుగురుకి మించి గుమికూడి ఉండరాదన్నారు. ముందస్తు అనుమతులు లేకుండా బహిరంగ సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించరాదన్నారు. ప్రత్యర్థి పార్టీ వారిని రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేయటం, సోషల్ మీడియాలో తప్పుడు సమాచారం, వదంతులు పెట్టి ప్రచారం చేయటం నేరమని వివరించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలందరూ శాంతియుత వాతావరణంలో జీవించేలా పౌరులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు.

కారును ఢీకొన్న బైక్

ఒకరికి తీవ్ర గాయాలు, మరో ఇద్దరికి స్వల్ప గాయాలు



గాయపడిన వారిని ఆసుపత్రికి తరలిస్తున్న టోల్‌గేట్ అంబులెన్స్ సిబ్బంది

ప్రొద్దుటూరు (కంకిపాడు), మే 18 : ప్రొద్దుటూరు అడ్డరోడ్డు వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురికి తీవ్రగాయాలయ్యాయి. సేకరించిన సమాచారం మేరకు.. ఉయ్యూరు పట్టణానికి చెందిన మనోజ్ మరో ఇద్దరు మిత్రులతో కలిసి బైక్‌పై ఆటోనగర్ నుంచి ఉయ్యూరు వెళ్తున్నారు. అదే సమయంలో విజయవాడ నుంచి ఉయ్యూరు వెళ్తున్న కారును ఈ ముగ్గురు వ్యక్తులు ఢీ కొన్నారు. ఈ ప్రమాదంలో మోటార్ సైకిల్‌పై వెళ్తున్న ముగ్గురు వ్యక్తుల్లో ఓ వ్యక్తికి కాలు విరగగా, మరో ఇదరికి స్వల్పగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న టోల్‌గేట్‌కు సంబంధించిన 1033 అంబులెన్స్ సిబ్బంది హుటా హుటిన సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలియజేశారు.

ఓట్ల లెక్కింపు ఏర్పాట్ల పరిశీలన

మచిలీపట్నం టౌన్, మే 18 : కృష్ణా విశ్వవిద్యాలయంలో వివిధ అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు ఏర్పాట్లను శనివారం ఆర్డీవో వాణి పరిశీలించారు. కౌంటింగ్ ప్రక్రియలో ఎప్పటికప్పుడు ఏ రౌండ్‌కు ఆ రౌండ్ మెజారిటీని డిస్‌ప్లే చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. కౌంటింగ్ ప్రక్రియ ఏర్పాట్లను వివిధ రాజకీయ పార్టీల చీఫ్ ఏజెంట్లకు ఆర్డీవో చూపించారు.

గండిగుంటలో పారిశుధ్యం అధ్వానం

గండిగుంట(ఉయ్యూరు), మే 18 : గండిగుంట పంచాయతీ పరిధిలో పేరు కుపోయిన చెత్తకుప్పలతో స్థానికులు అసౌకర్యానికి గురవుతున్నారు. గ్రామంలో ప్రధాన రహదారులతో పాటు, కాటూరు రోడ్డులో పేరుకుపోయిన చెత్త తొలగించకపోవడంతో వర్షాలకు కుళ్లి దుర్వాసన వెదజల్లుతోందని పరిసర ప్రాంత ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. కాటూరు రోడ్డులో మార్కెట్ యార్డు సమీపాన ఆర్డీవో కార్యాలయానికి వెళ్లే గేటు సమీపాన రోజుల తరబడి చెత్త కుప్పలు తొలగించక పేరుకుపోయి గాలికిలేచి రోడ్డుపై వెళ్లేవారి మీద పడుతున్నాయి. అదే విధంగా విశ్వశాంతి స్కూల్ వరకు రోడ్డుపక్కన చెత్తకుప్పలు పేరుకుపోయి ఎలుకలు, పందికొక్కులు చేరి రోడ్డు తొలచి వేసి సొరంగాల్లా చేయడంతో వాహనాలు పల్టీలు కొడుతున్నాయి. ఇప్పటికైనా గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి పారిశుధ్యంపై శ్రద్ధవహించాలని ప్రజలు కోరుతున్నారు.



కాటూరు రోడ్డులో ఆర్డీవో కార్యాలయం గేటు సమీపాన పేరుకుపోయిన చెత్త



వాసవీమాత మందిరంలో సామూహిక కుంకుమ పూజలో భక్తులు

ఘనంగా వాసవీమాత జయంతి

హనుమాన్‌జంక్షన్, మే 18 : స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలోని వాసవి మాత ఆలయంలో శనివారం వాసవి కన్యకాపరమేశ్వరి జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు శ్రీధర్‌శర్మ ఆధ్వర్యంలో అమ్మవారి మూల విగ్రహాలకు అభిషేకాలు జరిపిన అనంతరం సామూహిక కుంకుమ పూజ, శ్రీవాసవి హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను వేడుకగా జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం అమ్మవారికి కోలాటం డప్పువాయిద్యాల మధ్య గ్రామోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమాలను అమ్మవారి ప్రార్థన మందిరం అధ్యక్షుడు తవ్వా పూర్ణచంద్రరావు, కల్యాణ మండపం అధ్యక్షుడు చామర్తి రాంబాబు, ఆర్యవైశ్య జిల్లా నాయకులు పైడి సుధాకర్, గార్లపాటి రామకృష్ణ, పాబోలు బదరీ నాథ్, ఆర్యవైశ్య మహిళా సంఘం బాపులపాడు మండల అధ్యక్షురాలు లలిత, ఆర్యవైశ్య సంఘం బాపులపాడు మండల అధ్యక్షుడు కంభంపాటి శ్రీనివాసరావు తదితరులు పర్యవేక్షించారు.

దంత సమస్యలపై అప్రమత్తత అవసరం



దంత పరీక్షలు చేస్తున్న డాక్టర్ కాట్రగడ్డ సావేరి

గన్నవరం, మే 18 : దంత సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ కాట్రగడ్డ సావేరి అన్నారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాల క్రీడాప్రాంగణ వాకర్స్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో శనివారం స్టార్ హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సావేరి మాట్లాడుతూ, దంతాలను రెండు పూట్ల శుభ్రం చేసుకోవాలన్నారు. దంత సమస్యలపై నిర్లక్ష్యం చేయకూడదని వివరించారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీఆర్ కిషోర్ మాట్లాడుతూ, అందరి సహకారంతో దంత వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డాక్టర్ గు ర్రా ధన ప్రకాష్, సర్పంచ్ నిడమర్తి సౌజన్య, తిరివీధి వెంకయ్య, నిడమర్తి నాగేశ్వరరావు, డాక్టర్ లోయ నరేంద్ర, బొకినాల కోటేశ్వరరావు, వడ్లమూడి విజయకుమార్, పి.ప్రసాద్, ఆంజనేయులు, జాస్తి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు 21 నుంచి

ఘంటసాల : శ్రీకాకుళంలో రాజ్యలక్ష్మీ భోగలక్ష్మీ సమేత శ్రీకాకుళేశ్వరస్వామి కల్యాణ బ్రహ్మోత్సవాలు నెల 21 నుంచి 25వ తేదీ వరకు జరుగుతాయని ఈవో ఎన్.ఎస్.చక్రధరరావు శనివారం తెలిపారు. 21వ తేదీ ఉదయం 9 గంటలకు స్వామి వారిని పెండ్లి కుమారుడిని చేయుట, సాయంత్రం 6 గంటలకు హనుమంత వాహనంపై గ్రామోత్సవం, 22న ఉదయం పూజలు, రాత్రి 7 గంటలకు అశ్వవాహనంపై ఎదుర్కోలు ఉత్సవం, రాత్రి 8 గంటలకు స్వామి వారి కలాణ మహోత్సవం, రాత్రి ఒంటి గంటకు గరుడ వాహనంపై శ్రీకాకుళేశ్వరస్వామి గ్రామోత్సవం, 23వ తేదీ ఉదయం పూజలు, రాత్రి 9 గంటలకు రథాంగ హోమం, బలిహరణ, రథోత్సవం, 24న ఉదయం పూజలు, సాయంత్రం వసంతోత్సవము, గ్రామోత్సవం, అశ్వవాహనంపై ఊరేగింపు, ధ్వజావరోహణ జరుగుతాయన్నారు. 25వ తేదీ రాత్రి 7 గంటలకు శేషవాహనంపై గ్రామోత్సవం, ద్వాదశ ప్రదక్షిణలు, పుష్పయాగోత్సవం, పవళింపు సేవతో కల్యాణ మహోత్సవాలు ముగుస్తాయని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తరలించాలని ఆయన కోరారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	159, 168, 179
చికెన్ విత్ స్కిన్	310
చికెన్ స్కిన్‌లెస్	320



నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.5.40

ఓట్ల లెక్కింపు ఏర్పాట్ల పరిశీలన



మచిలీపట్నం టౌన్, మే 18 : కృష్ణా విశ్వవిద్యాలయంలో వివిధ అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు ఏర్పాట్లను శనివారం ఆర్డీవో వాణి పరిశీలించారు. కౌంటింగ్ ప్రక్రియలో ఎప్పటికప్పుడు ఏ రౌండ్‌కు ఆ రౌండ్ మెజారిటీని డిస్‌ప్లే చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. కౌంటింగ్ ప్రక్రియ ఏర్పాట్లను వివిధ రాజకీయ పార్టీల చీఫ్ ఏజెంట్లకు ఆర్డీవో చూపించారు.



ఇరిగేషన్ డీఈ రవికిరణ్‌కు వినతిపత్రం అందజేస్తున్న కూటమి నేతలు

కాల్వలకు మరమ్మతులు చేపట్టాలి

అవనిగడ్డ, మే 18 : పంట కాల్వలకు మరమ్మతులు చేపట్టాలని కోరుతూ కూటమి నేతలు శనివారం ఇరిగేషన్ శాఖ డీఈ రవికిరణ్‌కు వినతిపత్రం అందజేశారు. జూన్ నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులు వ్యవసాయ పనులు చేపట్టేందుక అత్యవసరంగా మరమ్మతులు చేయాల్సిన కాల్వల పనులను తక్షణమే చేపట్టాలన్నారు. జనసేన, టీడీపీ మండల అధ్యక్షులు గుడివాక శేషుబాబు, యాసం చిట్టిబాబు మాట్లాడుతూ ప్రతీ ఏడాది వేసవి కాలంలో కాల్వల మరమ్మతు పనులు చేపట్టాల్సి ఉందన్నారు. ఇరిగేషన్ అధికారులు స్పందించి వెంటనే కాల్వలు, డ్రెయిన్ల మరమ్మతులు చేయాలని కోరారు. బచ్చు వెంకటనాథ్ ప్రసాద్, కర్రా సుధాకర్, బండే రాఘవ, తుంగల వెంకటగిరి, దిడ్ల ప్రసాద్, చెన్నగిరి సత్యనారాయణ, మండలి ఉదయ్, మేడికొండ విజయ్, బొప్పన భాను, అన్నపరెడ్డి రామదాసు, అడపా వెంకటేశ్వరరావు, గుంటూరు వినయ్, మాదివాడ రాము, కొట్టే విజయ్, తదితరులు పాల్గొన్నారు.

చెన్నమల్లిఖార్జునస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



పూజలు చేసి ఉత్సవాలను ప్రారంభిస్తున్న కాశీనాథుని నాగేశ్వరరావు

పామర్రు, మే 18 : ఎలకుర్రు అగ్రహారంలో భ్రమరాంబ చెన్నమల్లిఖార్జునస్వామి వార్షిక బ్రహోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మూలవిరాట్‌కు, అమ్మవార్లకు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, విశేషపూజలు, అలంకరణలు, గణపతిపూజ, పుణ్యాహవచనం, అంకురారోపణ, ధ్వజారోహణం, పంచామృతాలతో అభిషేకాలు చేశారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త కాశీనాథుని నాగేశ్వరరావు స్వయంగా పూజలు నిర్వహించారు. సాంస్కృతిక ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. కళాకారుల్ని కాశీనాథుని నాగేశ్వరరావు ఘనంగా సత్కరించారు.

కూరాడలో వైభవంగా గంగానమ్మ జాతర



గుడ్లవల్లేరు, మే 18 : కూరాడలలో గంగానమ్మ జాతర మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. 1933 వరకూ ఏటా నిర్వహించిన ఈ జాతర తిరిగి 2019 వరకూ నిర్వహించలేదు. 2019లో గ్రామస్తులంతా కలసి 86 సంవత్సరాల తరువాత ఘనంగా నిర్వహించారు.ఐదేళ్ల తర్వాత ఈనెల 15 నుంచి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఆదివారం ప్రధాన ఉత్సవం, సోమవారం అన్నసమారాధన జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

శ్రీకాకుళేశ్వరస్వామి కల్యాణ బ్రహ్మోత్సవాలు 21 నుంచి



ఘంటసాల : శ్రీకాకుళంలో రాజ్యలక్ష్మీ భోగలక్ష్మీ సమేత శ్రీకాకుళేశ్వరస్వామి కల్యాణ బ్రహ్మోత్సవాలు నెల 21 నుంచి 25వ తేదీ వరకు జరుగుతాయని ఈవో ఎన్.ఎస్.చక్రధరరావు శనివారం తెలిపారు. 21వ తేదీ ఉదయం 9 గంటలకు స్వామివారిని పెండ్లి కుమారుడిని చేయుట, సాయంత్రం 6 గంటలకు హనుమంత వాహనంపై గ్రామోత్సవం, 22న ఉదయం పూజలు, రాత్రి 7 గంటలకు అశ్వవాహనంపై ఎదుర్కోలు ఉత్సవం, రాత్రి 8 గంటలకు స్వామివారి కలాణ మహోత్సవం, రాత్రి ఒంటి గంటకు గరుడ వాహనంపై శ్రీకాకుళేశ్వరస్వామి గ్రామోత్సవం, 23వ తేదీ ఉదయం పూజలు, రాత్రి 9 గంటలకు రథాంగ హోమం, బలిహరణ, రథోత్సవం, 24న ఉదయం పూజలు, సాయంత్రం వసంతోత్సవము, గ్రామోత్సవం, అశ్వవాహనంపై ఊరేగింపు, ధ్వజావరోహణ జరుగుతాయన్నారు. 25వ తేదీ రాత్రి 7 గంటలకు శేషవాహనంపై గ్రామోత్సవం, ద్వాదశ ప్రదక్షిణలు, పుష్పయాగోత్సవం, పవళింపు సేవతో కల్యాణ మహోత్సవాలు ముగుస్తాయని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తరలించాలని ఆయన కోరారు.

గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండాలి



మంటాడలో ప్రజలతో మాట్లాడుతున్న ఎస్సై శ్రీనివాసరావు

పమిడిముక్కల, మే 18 : గ్రామాల్లో ప్రశాంత వాతావరణానికి విఘాతం కలిగించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పమిడిముక్కల ఎస్సై శ్రీనివాసరావు హెచ్చరించారు. మంటాడలో శనివారం స్థానికులతో ఆయన మాట్లాడారు. ఎన్నికల కోడ్, 144 సీఆర్పీసీ, సెక్షన్ 30 అమలులో ఉన్నందున ఏ ప్రాంతంలో కూడా నలుగురికి మించి గుమికూడి ఉండరాదన్నారు. ముందస్తు అనుమతులు లేకుండా బహిరంగ సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించరాదన్నారు. ప్రత్యర్థి పార్టీ వారిని రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేయటం, సోషల్ మీడియాలో తప్పుడు సమాచారం, వదంతులు పెట్టి ప్రచారం చేయటం నేరమని వివరించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలందరూ శాంతియుత వాతావరణంలో జీవించేలా పౌరులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు.

గ్రంథాలయాల్లో విజ్ఞాన శిబిరాలు



అవనిగడ్డ, మే 18 : అవనిగడ్డలోని శాఖా గ్రంథాలయం లో వేసవి శిక్షణ తరగతులు జరుగుతున్నాయి. విద్యార్థులకు పుస్తక పఠనం, కథలు చెప్పించటం, చిత్ర లేఖనం, తెలుగు పద్యాలు, పాటలు నేర్పించారు. ఉపాధ్యాయులు డి.దీపిక, పి.ఉష, కె.స్నేహ విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. గ్రంథాలయాధికారి ప్రభుదాస్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేయాలి

అవనిగడ్డ రూరల్ : రాష్ట్రంలోని కౌలు రైతులకు కౌలు గుర్తింపు కార్డులు జారీ చేయాలని బీజేపీ కౌలు రైతుల సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ జి.వి.నగరాయులు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కౌలు రైతులకు ఇచ్చే గుర్తింపు కార్డులు కేవలం 11 నెలల కాల వ్యవధి మాత్రమే ఉంటుందని, కౌలు రైతులు భూ యజమానులను ఒప్పించి కౌలు రైతుల కార్డులు తీసుకోవాలని కోరారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రభుత్వం కౌలు రైతులకు ఇచ్చే రాయితీలు సక్రమంగా అందకపోవడం పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

వైసీపీకి ప్రతిపక్ష హోదా కూడా రాదు : గోపీచంద్

మచిలీపట్నం టౌన్, మే 18 : వైసీపీ నాయకులు మతి భ్రమించి మాట్లాడుతున్నారని టీడీపీ సీనియర్ నాయకుడు, టీడీపీ తెలుగురైతు రాష్ట్ర అధికార ప్రతినిధి గొర్రెపాటి గోపీచంద్ విమర్శించారు. శనివారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వస్తోందని పలు సర్వేలలో తేటతెల్లమయిందన్నారు. కూటమి అధికారంలోకి వస్తే వైసీపీని మూసేస్తారా అని గోపీచంద్ ప్రశ్నించారు. వైసీపీకి ప్రతిపక్ష హోదా దక్కేటట్టు లేదన్నారు. టీడీపీ జిల్లా ప్రచార కార్యదర్శి పి.వి. ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.



గుడివాడ బస్టాండ్ ఎదురుగా ప్రధాన రహదారిలో వర్షపు నీరు



మొవ్వ మండలం పెదపూడిలో చెరువును తలపిస్తున్న రహదారి



పూషడం వెళ్లే రహదారి భారీ గోతుల్లో వర్షపు నీరు

వైసీపీ నిర్వాకం-రోడ్లపై నరకం

● తటాకాలను తలపిస్తున్న రహదారులు ● ప్రమాదాల బారిన ప్రజలు

గుడివాడ : పేరు గొప్ప.. ఊరు దిబ్బ అనే సామెత గుడివాడ నియోజకవర్గానికి సరిగ్గా నప్పుతుంది. . పట్టణంలోని ప్రధాన రహదారులన్నీ గోతులతో అధ్వానంగా ఉంది. మామూలు సమయాల్లోనే ఈ రహదారుల్లో ప్రయాణం నరకమే. వర్షం కురిసే ప్రాణాలకు దినదినగండమే. ఐదేళ్ల వైసీపీ పాలనలో రహదారుల మరమ్మతులకు నిధులు విదల్చలేదు. చిన్నపాటి వర్షానికే పట్టణంలోని ప్రధాన రహదారులన్నీ నీటమునుగుతున్నాయి. అంతర్గత రహదారుల పరిస్థితి మరీ దారుణం. కనీసం ద్విచక్రవాహనం వెళ్లడానికి కూడా వీలు లేని పరిస్థితి. మోకాలు లోతు నీళ్లలో పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు.

పూషడం రోడ్లు చెరువులే..

ఘంటసాల : మండల పరిధిలోని పూషడం గ్రామం లో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రధాన రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. ప్రధాన రహదారుల్లో భారీ స్థాయిలో గోతులు పడి వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారు. గోతుల్లో నీరు నిలిచిపోవటంతో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గత ఐదు సంవత్సరాలుగా ప్రధాన రహదారి బాగు చేయమని ఎందరికి మొర పెట్టుకున్నా పట్టించుకోలేదని, వర్షాలతో రహదారుల్లో ప్రయాణించాలంటేనే ఇబ్బందిగా మారిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మోపిదేవి మండలంలో...

మోపిదేవి : వేసవికాలంలో కురిసిన అకాల వర్షంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మూడు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా దెబ్బతిని రహదారులు, వీధుల్లో నీరు నిలిచాయి. అంతంత మాత్రంగా ఉన్న రహదారుల వెంబడి నీరు నిలిచి చెరువులను తలపిస్తున్నాయి. వాహనదారులు గోతుల్లో పడి గాయాలపాలవుతున్నారు. చల్లపల్లి నుంచి వెంకటాపురం, పెదకళ్లేపల్లి, మోపిదేవి వెళ్లే రహదారులు గోతులు పడి కొద్దిపాటి చెరువులను తలపించే రహదారులు కనిపిస్తున్నాయి.



శివరామపురం వద్ద చెరువులా కనిపిస్తున్న రహదారి

మొవ్వ మండలంలో..

కూచిపూడి : రహదారులు చెరువులను తలపిస్తున్నా యి. వాహనదారులకు, ప్రజలకు రహదారులు నరక చూపిస్తున్నాయి. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గోతులమయంగా మారిన రహదారిలోకి నీళ్లు చేరాయి. చెరువుల్లో ప్రయాణిస్తున్నామా? అనే అనుమానం కలుగుతుంది. పెదపూడి, కూచిపూడి గ్రామా ల్లో డ్రైన్లు పూడుకుపోయి కురిసిన వర్షం నీరంతా రోడ్లపైనే నిలిచిపోయింది. పెదపూడి చెరువు సమీపంలో బందరు రోడ్డులో గల భారీ గోతులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. అధికారులు వీటిపై దృష్టి సారించకపోవటంతో ప్రజలకు అవస్థలు తప్పటం లేదు. కూచిపూడిలో దుకాణాల ముందు వ్యాపారస్థులు మెరక చేసుకోవటంతో వర్షపు నీరంతా రోడ్లపైకి, భారీ గోతుల్లోకి చేరింది. కూచిపూడి, పెదపూడిల్లో చిరువ్యాపారస్థులు ఇంచుమించుగా రోడ్లపైనే వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. మండలంలోని 21 గ్రామపంచాయతీల్లో ఇదే పరిస్థితి కనిపిస్తుంది. చెరువులను తలపిస్తున్న రహదారుల్లో ప్రయాణించటం ప్రజలకు ప్రాణసంకటంగా మారింది.

సొర్లగొంది పడవలరేవు రహదారి బాగుచేయిస్తా



సొర్లగొంది పడవల రేవు రహదారిని పరిశీలిస్తున్న విక్కుర్తి శ్రీనివాస్

నాగాయలంక, మే 18 : సముద్రపు వేట ఆధారంగా జీవనం సాగిస్తున్న సొర్లగొంది వాసుల పడవల రేవు రహదారి సమస్యను పరిష్కరించేందుకు పారిశ్రామికవేత్త విక్కుర్తి శ్రీనివాస్ ముందుకు వచ్చారు. గ్రామ పెద్దల ఆహ్వానం మేరకు శనివారం గ్రామానికి వెళ్లిన శ్రీనివాస్‌కు పడవల రేవు రహదారిని చూపించారు. రాత్రి పగలు తేడా లేకుండా పోటు సమయంలో పడవల రేవుకు వెళ్లేందుకు ఈ రహదారి ఒక్కటే తమకున్న ఏకైక మార్గమన్నారు. త్వరలోనే రహదారి సమస్యను తమ ట్రస్ట్ ద్వారా పరిష్కరిస్తామన్నారు. రహదారిని పూర్తి చేసి వాహ నాలపై పడవల రేవుకు వెళ్లేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఎంపీటీసీ సభ్యుడు ధనుంజయరావు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కొక్కిలిగడ్డ శ్రీనివాసరావు, గ్రామాభివృద్ధి కమిటీ నేతలు త మ్ము వెంకటేశ్వరరావు, కొప్పనాతి వెంకటేశ్వరరావు, తమ్ము నరసింహారావు, వనమాల రామారావు, విశ్వనాథపల్లి రాములు, కోలా భిక్షం తదితరులు శ్రీనివాస్‌కు గ్రామసమస్యలు వివరించారు. అనంతరం విక్కుర్తి శ్రీనివాస్ మత్స్యకారుల ఆరాధ్య దైవమైన సత్తెమ్మ తల్లి శిలను పరిశీలించారు. వేటకు వెళ్లే మత్స్యకారులు విధిగా సత్తెమ్మ తల్లికి పూజలు నిర్వహించి వేటకు వెళ్లటం ఆనవాయితీ. అక్కడ మంటపం నిర్మాణ పనులను నిర్మించేందుకు శ్రీనివాస్ ముం దుకు వచ్చారు. ఆయన వెంట పులిగడ్డ చంద్ర, భూపతి నాంచారయ్య, బర్మా శ్రీను, బొంతు ప్రకాష్, ప్రతాప్, పొన్నారావు, వర్రే బస్వారావు, బర్మా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నేత్రపరీక్షలు

చల్లపల్లి, మే 18 : చల్లపల్లి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో లయన్స్ మల్టీపర్పస్ సర్వీస్ సెంటరులో శనివారం ఉచిత నేత్ర పరీక్షా శిబిరం నిర్వహించారు. సుజలాం వాటర్ ప్లాంట్ నిర్వాహకులు డి.భాస్కరరావు ఆర్థిక సహకారంతో డాక్టర్ వెంకట్రావ్ 42 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించి 15 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపికచేశారు. గూడూరులోని సాయినేత్ర నేత్రాలయానికి వారిని ఆపరేషన్లకు తరలించారు. లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మోపిదేవి వెంకటేశ్వరరావు, రాయపాటి రాధాకృష్ణ, నర్రా సాయిబాబు, ఎంవి.కృష్ణారావు పర్యవేక్షించారు.

గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. గుడివాడ లయన్స్ నేత్ర వైద్యశాల డాక్టర్లు కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి గుడివాడ లయన్స్ నేత్ర వైద్యశాలలో ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తామని తెలిపారు.



మొవ్వలో వాసవీ అమ్మవారి ఊరేగింపు



కోడూరులో గ్రామోత్సవానికి అమ్మవారిని తీసుకొస్తున్న ప్రముఖులు

భక్తిశ్రద్ధలతో వాసవీ మాత జయంతి



చల్లపల్లిలో విశేష అలంకరణ, వీరంకిలాకులో అమ్మవారికి పూజలు

పెడన, మే 18 : ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి జయంతి మహోత్సవాలు శనివారం వైభవంగా ప్రారం భమయ్యాయి. ఉదయం గణపతి పూజ, గోపూజ నిర్వహించిన అనం తరం వాసవీ మాతను 108 లీటర్ల ఆవుపాలతో, 18 రకాల ద్రవ్యాలతో అభిషేకించారు. రాత్రి వాసవీ మహిళా మండలి సభ్యులు అమ్మవారికి పిండి జ్యోతులతో హారతులిచ్చా రు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొల్లూరి చిన్నా పర్యవేక్షణలో జరిగిన పూజ ల్లో తమ్మన సుబ్బారావు, కొల్లూరి రాధాకృష్ణ, కొత్త ఫణిభూషణరావు, కొమ్మూరి శారద, మామిడి సావిత్రి, కొల్లూరి మంజులత, తమ్మన లక్ష్మీతాయారు తదితరులు పాల్గొన్నారు .**పమిడిముక్కల :** పమిడిముక్కల మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శనివారం వాసవీమాత జయంతిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వీరంకిలాకులవద్ద ఆర్యవైశ్య కళ్యాణమండపంలో సామూహిక కుంకుమార్చన, వాసవీ మాత వ్రతం జరిగాయి. ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ప్రధానకార్యదర్శి వెంట్రప్రగడ వీరాంజనేయులు, జిల్లా ఉపాధ్యక్షుడు పిచ్చేశ్వరరావు, పీఆర్వో చెక్కా ఆంజనేయులు, మండల అధ్యక్షుడు మాటూరి సాయిబాబు, గుప్తా, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. **పామర్రు:** వాసవీ కన్యకాపరమేశ్వరి జయంతిని ఘనంగా నిర్వహిం చారు. పంచాభిషేకాలు, విశేష పూజలు, హోమా లు ఆలయ ధర్మకర్త బొగ్గవరపు జాలయ్య పర్యవేక్షణలో అర్చకుడు మాధవాచార్యులు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం, యువజన సంఘ నేతలు చంద్రమౌళి, రామకృష్ణ, తాళ్లూరి నరేష్ తదితరులు పాల్గొన్నారు. **చల్లపల్లి :** కన్యకా పరమేశ్వరి జయంతి వేడుకలు శనివారం చల్లపల్లిలో వైభవంగా జరిగాయి. విశేష పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు మామిళ్లపల్లి శివరామకృష్ణ అమ్మవారికి రజత కవచాలంకృత అలంకరణ, సహస్ర కుంకుమార్చన, లక్ష మల్లెల అర్చన జరిపారు. ఆలయ కమిటీ పెద్దలు కొల్లిపర మధు, అన్నవరపు పాండురంగారావు, ఉడత్తు బాబు, జూపూడి సాయి, వరదా హరిగోపాల్, జల్లూరి ప్రసాద్, కొల్లిపర సాంబశివరావు తదితరులు పర్యవేక్షించారు. **కూచిపూడి :** మొ వ్వలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీ మాతకు విశేష పూజలు, కుంకుమార్చన, ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన జరిగింది. నందిపాటి నాగ రమేష్, పువ్వాడ సురేష్, మాటూరి వెంకటేశ్వరరావు, యెండూరి జగన్మోహనరావు, ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు. **కోడూరు :** మండల ఆర్యవైశ్య సంఘం, వాసవీ క్లబ్ దివిసీమ ఆధ్వర్యంలో వాసవీ కన్యకా పరమేశ్వరి జయంతి వేడుకలు ఘనం గా నిర్వహించారు. శివరామక్షేత్రం అమ్మవారికి పూజలు, సామూహిక కుంకుమార్చన, లలితా విష్ణు సహస్ర నామ పారాయణం జరిగింది. మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు అన్నం శ్రీనివాస్, వాసవీ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు బూరగడ్డ హరినాథ్ బాబు, కిరణా వర్తక సంఘం అధ్యక్షులు మద్దాళి ప్రసాద్, వాసవీక్లబ్ అధ్యక్షులు కోడూరు సత్యనారాయణ, ఆర్గనైజర్ అన్నం శివరామకృష్ణ పాల్గొన్నారు.